సాక్షి
ఆదిలాబాద్
బుధవారం। 18। జనవరి। 2023



సందడిగా ఖందేవ్ జాతర 8లో▸
నార్నూర్ మండలంలో ఖందేవ్ జాతర కొనసాగుతోంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీసీలో రాజకీయ కోణం



ఇదివరకు ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎంగా వ్యవహరించిన సుధా పరిమళ బదిలీపై వెళ్లి నెలరోజుల పైబడింది. ఈ ట్రాన్స్‌ఫర్ సంస్థాగతంగా జరిగిందా.. లేనివక్షంలో ఇందులో ఏదైనా కోణం ఉందా అనే అంశం అప్పట్లోనే చర్చకు వచ్చింది. ఇందులో రాజకీయ కోణం ఉందని ఆలస్యంగా వెలుగులోకి వస్తుంది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0/17.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రివేళలో చలితీవ్రత కొంత తగ్గనుంది.

న్యూస్‌రీల్

నాన్‌టీచింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి



ఆందోళనలో పాల్గొన్న కేజీబీవీ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండ కేజీబీవీలో ఇటీవల తొలగించిన నాన్‌టీచింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని కేజీబీవీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కళావతి మాట్లాడారు. కేజీబీవీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుల్తాన, ప్రేమల, లక్ష్మి, రుతిక, వేదవతి, యశోద, కవిత, పుష్ప, జమున పాల్గొన్నారు.

11 నుంచి సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీ వరకు సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్, హయ్యర్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను bse. telangana. gov. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రేపు జాబ్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 19న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ రంగంలో హైదరాబాద్‌లో సెల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 50 వరకు ఖాళీలు ఉన్నాయని, ఎస్సెస్సీ, ఆపై చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.18వేల వరకు వేతనంతో పాటు ఇతర అలవెన్సులు ఉంటాయని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 82476 56356, 76599 78443 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో గల ప్రభుత్వ బాలుర కళాశాల వసతి గృహంలో బీసీ వసతి గృహ సంక్షేమాధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులకు ఆరోగ్యం, పరిశుభ్రత, వసతి గృహాల రికార్డుల నిర్వహణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు చంద్రశేఖర్, రిటైర్డ్ డీటీవో దయాకర్, ఎస్టీవోలు సిరాజ్, రాఘవేంద్ర, సంక్షేమాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విపక్షాల దుష్ప్రచారం తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, విపక్షాల దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని సూచించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా విభాగం సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సోషల్ మీడియా వారియర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. టీఎస్ఎండీసీ కార్పొరేషన్ చైర్మన్ క్రిశాంక్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దినేష్ సామాజిక మధ్యమాల వినియోగంలోని పలు అంశాలను వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీఐ స్థలంలోని లైమ్‌స్టోన్ తవ్వకాలు చేపడుతున్న రియల్ వ్యాపారులు

భూం ఫట్ !

- సీసీఐ భూములపై రియల్ కన్ను
- రూ.కోట్లాది విలువైన స్థలాలు కబ్జా
- అక్రమార్కులకు వంత పాడుతున్న అధికారులు ?
- కళ్లెదుటే తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో రియల్ మాఫియా రెచ్చిపోతుంది. ప్రభుత్వ, అసైన్డ్ వంటి భూములేవైనా సరే వదట్లేదు. ఇలాంటి స్థలాలపై కన్ను పడితే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. బండలు పాతేసి లేఅవుట్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్లుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. తాజాగా ఈ రియల్ అక్రమార్కులు రూ.కోట్లాది విలువైన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) భూములపై కన్నేశారు. గుట్టు చప్పుడు కాకుండా లైమ్ స్టోన్ నిల్వలున్న స్థలాన్ని జేసీబీల సాయంతో రాత్రికి రాత్రే తవ్వేస్తూ భూమిని చదును చేస్తున్నారు. ఈ భూములను కాపాడాల్సిన ఓ బాధ్యత గల అధికారి అక్రమార్కులకు వంత పాడుతుండటంతోనే రియల్ వ్యాపారులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని సీసీఐ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం పోలీసు కేసు నమోదు చేశామని చెప్పి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కేంద్రంలో ప్రభుత్వరంగ సంస్థ (సీసీఐ)కి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలున్నాయి. ఈ పరిశ్రమ దశాబ్దాల క్రితం మూతపడడంతో వాటిని పర్యవేక్షించే నాథుడు కరువయ్యారు. దీనికి తోడు పట్టణంలో ఇటీవల రియల్ దందా జోరందుకుంది. ఇదే అదునుగా భావించిన రియల్టర్లు సీసీఐ భూములపై కన్నేశారు. స్థానిక నిషాన్‌ఘాట్ శివారులో గల సీసీఐకి సంబంధించి లైమ్‌స్టోన్ నిల్వ ఉంచిన ప్రాంతాల్లో జేసీబీలు, టిప్పర్ల సాయంతో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా లైమ్‌స్టోన్ నిల్వలను తరలిస్తూ లేఅవుట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సీసీఐ స్థలాన్ని కబ్జా చేసి బయట నుంచి మట్టిని తరలించి ఆ ప్రాంతాన్ని చదును చేస్తున్నారు. ఈ అక్రమదందా అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా నియంత్రించే వారు కరువయ్యారు. అధికారులే వరూ అటువైపు చూడకపోవడంతో మరింత రెచ్చిపోయి లైమ్‌స్టోన్‌ను కనుమరుగు చేస్తూ ల్యాండ్‌ను కబ్జా చేస్తున్నారు.

చదును చేసేస్తున్నారు

సీసీఐ లోని సర్వేనంబర్ 51/1, 51/2 లోని స్థలంలో గల సున్నపురాయి నిల్వలను పూర్తిగా తొలగించి వెంచర్‌గా మారుస్తున్నారు. ఇప్పటికే కొంత భాగం పనులు కూడా పూర్తయ్యాయి. హద్దులుగా రాళ్లను పాతారు. మరికొంత భాగంలో పనులు కొనసాగుతున్నాయి. ఇంతా జరుగుతున్నా సీసీఐ అధికారులు కేవలం పోలీసులకు ఫిర్యాదు చేశామని చెబుతూ తప్పించుకుంటున్నారు. సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఈ విషయంలో ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఎవరి ప్రమేయంతో రియల్ వ్యాపారులు నిర్భయంగా పనులు చేపడుతున్నారోననే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సీసీఐ ఫ్యాక్టరీకి సంబంధించి వందల ఎకరాలు సొంత భూమి ఉండగా, వెయ్యికి పైగా ఎకరాలు లీజు తీసుకున్న భూములున్నాయి. ప్రస్తుతం వెంచర్లు వేస్తున్నటువంటి స్థలం లీజు భూమినేనని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు చెబుతున్నారు. తద్వారా ఈ లీజు భూముల అధికార బాధ్యత ఎవరి దగ్గర వికేంద్రీకరణమై ఉంటుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విచారణ జరిపించాలి



సీసీఐ లీజ్ స్థలాలను రియ ల్ వ్యాపారులు కొనుగోలు చేశామని చెబుతున్నారు. ఆ భూములు వ్యాపారులవా, లేక సీసీఐవీ అనే దానిపై విచారణ జరిపించాలి. సీసీఐ అధికారి వ్యాపారులకు ఎన్‌ఓసీ జారీ చేసి వంతపాడుతున్నారు. ఈ అధికారి పాత్రపై విచారణ జరిపించి చట్టపరంగా ఆయనపై చర్యలు తీసుకోవాలి. అవసరమైతే జైలుకు పంపించాలి.

– ఎస్.విలాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

పోలీసులకు ఫిర్యాదు చేశాం

లైమ్‌స్టోన్ నిల్వ ఉన్న ప్రాంతాల్లో కొంతమంది తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. విషయం తెలిసిన వెంటనే హోంగార్డును పంపించి తవ్వకాలను నిలిపివేయించాం. అక్రమ తవ్వకాలపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాం. సీసీఐ లీజ్ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది. దాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం.

– ఆర్‌కే. గుప్తా, సీసీఐ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి

అమిత్ షా పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్

- ఎంపీ సోయం బాపూరావ్
- 28న ఉమ్మడి జిల్లాకు కేంద్ర హోంశాఖ మంత్రి రాక

ఆదిలాబాద్: ఈనెల 28న ఉమ్మడి జిల్లాలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నాయకులతో మంగళవారం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా అమిత్‌షా ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించనున్నట్లు తెలిపారు. ముందుగా పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో పర్యటిస్తారని వెల్లడించారు. అక్కడ పార్టీ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారన్నారు. అలాగే ఆదివాసీల ఆరాధ్యుడైన కుమురంభీం జన్మస్థలమైన జోడేఘాట్‌ను సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అధినాయకత్వం ముందుకు వెళుతుందన్నారు. ఇందులో భాగంగా హోంమంత్రి ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రవాస్‌యాత్రను ప్రారంభిస్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, కోకన్వీనర్ మయూర్ చంద్ర, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, నాయకులు రాథోడ్ రమేశ్, బోయర్ విజయ్, అంకత్ రమేశ్, సుహాసినిరెడ్డి, వేణుగోపాల్, నగేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్



పిట్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్: ఇక పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం జరగనుందని ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న పిట్ లైన్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతోనే రైల్వేలైన్ పనులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. అయితే రాష్ట్ర మంత్రి ఐకే రెడ్డి ఈ రైల్వేలైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని ఇటీవల మాట్లాడడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. రైల్వేలైన్ నిర్మాణం కోసం కేంద్రమే వందశాతం నిధులు కేటాయించాలని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఇటీవల కలిసి తాను విన్నవించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వందశాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ స్టేషన్‌కు పిట్‌లైన్ మంజూరు చేయడం జరిగిందని, ఈ పనులకు సంబంధించి త్వరలోనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారని పేర్కొన్నారు. ఈ పిట్‌లైన్ నిర్మాణంతో జిల్లా వాసులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, బీజేవైఎం నాయకుడు మహేందర్, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కంటి వెలుగు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు డెమో కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంద రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈమేరకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. వారి వెంట డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, వైద్యుడు శ్రీకాంత్, స్థానిక సర్పంచ్ గాంధారి, ఈవో సంజీవ్‌రావ్ తదితరులున్నారు.

పుర ప్రజావాణికి స్పందన

- ప్రక్రియను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పుర ప్రజావాణికి మంగళవారం స్పందన లభించింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి 53 దరఖాస్తులు అందాయి. బాధితుల నుంచి కమిషనర్ శైలజ అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 29 రాగా, అత్యల్పంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు ఉన్నాయి. అలాగే ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి ఆరు, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 15, శానిటేషన్‌కు సంబంధించి ఒక అర్జీ అందాయి.

- పట్టణంలోని ఖానాపూర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని గంగపుత్ర సంఘం నాయకులు కోరారు.
- స్థానిక భుక్తాపూర్‌లోని అరుణ్ ఐస్‌క్రీం ముందట గల మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ యాంటీ కరప్షన్ కమిటీ బోర్డు టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్ షాహిద్ అలీ వినతిపత్రం అందజేశారు.
- డ్రైవర్స్ కాలనీ మున్సిపల్ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను తొలగించాలంటూ వార్డు కౌన్సిలర్ చందా నర్సింగ్, మాజీ కౌన్సిలర్ మెస్రం కృష్ణ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ ప్రజావాణి ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ యూనుస్, టీపీఎస్ అనురాధ, ఆర్వో జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శైలజ, పరిశీలిస్తున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ

“తలమడుగు చెందిన కరుణాకర్‌రెడ్డి తనకున్న 25 ఎకరాల్లో వానాకాలంలో పత్తి సాగు చేశాడు. ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇంత కాలం పత్తిని ఇంట్లోనే నిల్వచేశాడు. స్థానికంగా పత్తి కొనుగోళ్లు ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా రేటు మాత్రం పెరగడం లేదు. ఇక్కడితో పోలిస్తే మహారాష్ట్రలోని ఇంఫన్‌ఘాట్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఎక్కువ ఉండడంతో మంగళవారం పత్తిని ఇలా వాహనంలో తీసుకెళ్తున్నాడు.



మహారాష్ట్ర మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు పత్తిని వాహనంలో నింపుతున్నారిలా..



“ఇక్కడ కనిపిస్తున్నది తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన రైతు రాజన్న. తనకున్న మూడెకరాల్లో ఈ సారి పత్తి సాగు చేశాడు. ఇప్పటి వరకు 23 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మరో ఐదారు క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నాడు. అయితే గతేడాదితో పోలిస్తే ధర తక్కువ ఉండడంతో దిగుబడినంతా ఇంట్లోనే నిల్వ చేశాడు. ధర పెరుగుతందనే ఆశతోనే నెలల తరబడి వేచి చూస్తున్నానంటున్నాడు. పెరిగిన పెట్టుబడులతో ధర రూ.10 వేలు ఉంటే గాని గిట్టుబాటు అయ్యే అవకాశం లేదంటున్నాడు ఈయన. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాడు.

పత్తి ధర పెరిగేదెప్పుడో..!

- రైతన్నకు తప్పని ఎదురుచూపు
- ఇంకా ఇళ్లలోనే నిల్వలు
- రంగంలో ఉన్నా కొనని సీసీఐ
- రూ.10 వేలతో కొనాలని అఖిలపక్షం డిమాండ్

పత్తి కొనుగోళ్ల వివరాలు.. (క్వింటాళ్లలో)

మార్కెట్	గతేడాది	ఈ ఏడాది (ఈ నెల 13 వరకు..)
ఆదిలాబాద్	5,00,515	2,86,510
బోథ్	90,948	20,906
ఇంద్రవెల్లి	85,442	17,618
ఇచ్చోడ	42,158	13,384
జైనథ్	21,844	4,613
మొత్తం	7,40,907	3,43,030



రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

ఆదిలాబాద్‌టౌన్: పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు దిగులు చెందుతున్నారు. సాగు సమయంలో భారీ వర్షాలతో పంట దెబ్బతినగా దిగుబడిపై ప్రభావం చూపింది. ప్రస్తుతం సరైన ధర లేకపోవడం వారిని మరింత ఆందోళనకు గురి చేస్తుంది. గతేడాది ఇదే సమయంలో క్వింటాల్ ధర రూ.10వేల వరకు ఉండగా, ఈ సారి రూ.8వేలవరకే ఉండడం గమనార్హం. వ్యాపారులు ధర పెంచకపోవడంతో కొంతమంది మహారాష్ట్రలోని మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. అక్కడ ధర కొంత ఎక్కువగా ఉన్నా రైతులకు వాహన చార్జీలు, ఇతర ఖర్చులు భారంగా మారుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర పెరగడం లేదు. పక్షం రోజులుగా క్వింటాల్ ధర రూ.8 వేల చుట్టే తిరుగుతోంది. పత్తి ధర రూ.10 వేలకు పెరిగితే మార్కెట్‌కు తీసుకొద్దామని అనుకుంటున్న రైతుల ఆశలు నెరవేరడం లేదు. జిల్లాలోనే ఆదిలాబాద్ మార్కెట్లో ఏటా కొనుగోళ్లు ఎక్కువ సంఖ్యలో జరుగుతాయి. దాదాపు 18 నుంచి 20 లక్షల క్వింటాళ్ల వరకు విక్రయాలు ఉంటుండగా.. ఈసారి ఇప్పటి వరకు 2.86 లక్షల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 15 లక్షల క్వింటాళ్లకుపైగా రైతుల ఇళ్లలోనే ఇంకా నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది.

సీసీఐ ప్రేక్షకపాత్రే..

ప్రభుత్వరంగ సంస్థ అయిన సీసీఐ ఈ ఏడాది వాణిజ్య కొనుగోళ్లకు ముందుకు వచ్చినా రైతులకు మాత్రం మేలు జరగడం లేదు. ఒకటి రెండు సార్లు ప్రైవేట్ వ్యాపారుల కంటే రూ.100లోపు పెంచినా.. వారికి మాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. సీసీఐతో పోలిస్తే వ్యాపారులే కొంత ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో కనీసం కిలో పత్తిని కూడా సీసీఐ కొనలేదు. వ్యాపారులు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించినప్పుడు రాష్ట్రంలోని ఇతర మార్కెట్లతో పోలిస్తే ఆదిలాబాద్‌లో కొంత ధర ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదు. మొదటి రోజు మాత్రమే ధర అధికంగా ఉండగా, ఆ తర్వాత ఇతర మార్కెట్ల కంటే ఆదిలాబాద్‌లో తక్కువగా ఉండడం గమనార్హం. జిల్లాకు అనుకొని ఉన్న మహారాష్ట్రలోని మార్కెట్లలో ఇక్కడితో పోలిస్తే రూ.300 నుంచి రూ.500 వరకు ఎక్కువగా ఉంది.

ధర పెంచాలని అఖిలపక్షం ఆందోళన

పత్తి ధర రూ.10 వేలకు పెంచి కొనుగోళ్లు చేయాలని అఖిలపక్షం ఆందోళన బాట పట్టింది. పక్షం రోజులుగా ఆందోళనలు చేపట్టింది. సీసీఐ అధికారులు, జిల్లా యంత్రాంగానికి వినతిపత్రాలు ఇవ్వడం.. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టడం.. లాంటివి జరిగాయి. అలాగే బీజేపీ మినహా ఇతర పార్టీలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అదే విధంగా ఆదివాసీ తుడుందెబ్బ నాయకులు సైతం పత్తికి క్వింటాల్ ధర రూ.10 వేలు పెంచాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట దర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షం ఆందోళన చేయగా, బీజేపీ నాయకులు మాత్రం ఇందులో జోక్యం చేసుకోవడం లేదు. వీరు చేపట్టిన నిరసనను రాజకీయ కోణంలో చూస్తున్నారు. అఖిలపక్ష నాయకులు భవిష్యత్ కార్యాచరణ కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం

పత్తి ధర పెంచాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాం. ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ వాణిజ్య కొనుగోళ్లు చేస్తున్నా.. ధర పెంచడం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధర అధికంగానే ఉంది. కేంద్రం జోక్యం చేసుకొని క్వింటాల్ ధర రూ.10 వేల కంటే ఎక్కువగా ఉండేట్లు చూడాలి. గతేడాది ఆదిలాబాద్ మార్కెట్‌లోనే క్వింటాల్ ధర రూ.10 వేలు పలకగా, ఈ సారి రూ.8 వేలకు మించడం లేదు. భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాల కోసం రైతు సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందిస్తాం.

– బండి దత్తాత్రి, రైతు సంఘం నాయకుడు

క్లుప్తంగా

నేటి డిగ్రీ పరీక్ష వాయిదా

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం ద్వారా బుధవారం జరగాల్సిన పరీక్ష అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 8న నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆయన కోరారు.

డిగ్రీలో పది మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ సెమిస్టర్–3,5 పరీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షల్లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో పది మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. భైంసాలోని గోకుల్‌దాస్ పురుషోత్తందాస్ లడ్డ డిగ్రీ కళాశాలలో నలుగురు, నిర్మల్‌లోని నందన డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు చొప్పున డిబారైనట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పిన ద్విచక్రవాహనం


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు గజానంద్

బోథ్: మండలంలోని కోట(కె) గ్రామానికి చెందిన గజానంద్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని తన బంధువుల ఇంటికి వెళ్లిన గజానంద్ తిరుగు ప్రయాణంలో నాగుగూడ వద్ద బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. గాయాలపాలైన గజనాంద్‌ను స్థానికులు బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

సమస్యలు పరిష్కరించాకే బదిలీలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్: రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన 317 జీవో ప్రకారం బదిలీలు అయిన ఉపాధ్యాయుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాకే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేశ్, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెడ్మా శ్యాంరావ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుక అంటూ బదిలీలు, పదోన్నతులు చేపట్టడం సరికాదన్నారు. 317 జీవో ప్రకారం ఇతర జిల్లాలకు బదిలీలు అయిన వారికి స్థానికత వర్తించిన సీనియార్టీ ప్రకారం అన్యాయం జరుగుతుందన్నారు. బదిలీలు అయిన ఉపాధ్యాయుల సర్వీసును పరిగణలోకి తీసుకొని బదిలీలు, పదోన్నతలు చేపట్టాలన్నారు. సమావేశంలో టీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు జాదవ్ రవీంధర్, జాదవ్ సురేశ్, సదానంద్, ఇందాల్‌సింగ్, విఠల్, రవీందర్, కైలాస్ ఉన్నారు.

నాగోబా జాతర వైభవంగా నిర్వహిద్దాం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు
- తాగునీరు, పారిశుధ్యం లోపించకుండా చూడాలి
- నాగోబా జాతర సమీక్షా సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్


కోనేరును పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మహాపూజతో ప్రారంభం కానున్న కేస్లాపూర్ నాగోబా జాతరను ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డితో కలిసి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో దర్బార్‌హాల్‌లో సమావేశమయ్యారు. శాఖల వారీగా ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కోవిడ్‌తో రెండు సంవత్సరాల తరువాత భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలిపారు. ఈ నెల 24న నిర్వహించే దర్బార్ సమావేశానికి గిరిజన సంక్షేమశాఖ, దేవాదాయశాఖ మంత్రులు రాథోడ్ సత్యవతి, ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని వివరించారు. జాతర ముగింపు వరకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నలుమూలలతో పాటు మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య రాకుండా చూడాలని చెప్పారు. జాతరలో ప్రతీ ఒక్కరు కోవిడ్ నిబంధనలు పాటించేలా చూడాలని తెలిపారు. బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, ఆర్‌డీవో కదం సురేష్, ఏఎస్పీ హర్షవర్ధన్, డీడీ దిలీప్‌కుమార్, ఆలయ ఈవో రాజమౌళి, సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏఎస్‌డీ కృష్ణయ్య, అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు, ఏవో రాంబాబు పాల్గొన్నారు.


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


మెస్రం వంశీయులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్టీసీలో రాజకీయ కోణం

- గత ఆర్‌ఎం బదిలీలో ఉమ్మడి జిల్లా నేతల ఒత్తిడి
- పలువురు డ్రైవర్లు, కండక్టర్ల బదిలీ ప్రక్రియతో గుర్రు
- డ్యూటీలు వేసే క్రమంలో ఉద్యోగుల అలక


గతంలో ఆర్‌ఎంగా పనిచేసిన సుధా పరిమళ

సాక్షి, ఆదిలాబాద్: ఇదివరకు ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎంగా వ్యవహరించి సుధా పరిమళ బదిలీపై వెళ్లి నెలరోజుల పైబడింది. ఈ ట్రాన్స్‌ఫర్ సంస్థగతంగా జరిగిందా.. లేనిపక్షంలో ఇందులో ఏదైన కోణం ఉందా అనే అంశం అప్పట్లోనే చర్చకు వచ్చింది. ఇందులో రాజకీయ కోణం ఉందని ఆలస్యంగా వెలుగులోకి వస్తుంది. కేవలం ఎనిమిది నెలల పాటు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఆమెను వరంగల్ జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీ చేయడంపై సంస్థలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విధుల పట్ల నిక్కచ్చిగా వ్యవహరించే ఆమెను కళాశాల ప్రిన్సిపల్ పాత్రకు పరిమితం చేయడమే బదిలీ వెనుక ఏదో జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చర్చనీయం..

సాధారణంగా ప్రభుత్వంలోని వివిధ శాఖల పరంగా తమ పనులు సవ్యంగా జరిగేందుకు ప్రజాప్రతినిధులు తమకు అనువుగా ఉండే అధికారులను నియమించుకోవడం సర్వసాధారణం. అయితే ఆర్టీసీ పరంగా చూస్తే దీంట్లో రాజకీయ ప్రమేయం స్వల్పంగా ఉంటుంది. డ్రైవర్లు, కండక్టర్లు బదిలీల పరంగా ఇదివరకు తమ యూనియన్ సంఘాల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం సంఘాల పాత్ర లేకపోవడంతో ప్రజాప్రతినిధుల ద్వారా రాష్ట్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి ఇలాంటివి చేపట్టేందుకు వెనుకాడటం లేదు.

బదిలీల ప్రక్రియతోనే..

ఆర్టీసీ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్‌గా సుధా పరిమళ గతేడాది మార్చి 24న బాధ్యతలు స్వీకరించి డిసెంబర్ 5 వరకు పనిచేశారు. ఆమె స్థానంలో పదోన్నతిపై జానిరెడ్డిని ఆదిలాబాద్ ఆర్‌ఎంగా నియమించారు. రీజియన్ పరిధిలోకి మంచిర్యాల, ఆదిలాబాద్, భైంసా, నిర్మల్, ఆసిఫాబాద్, ఉట్నూర్ వస్తాయి. కాగా సూపర్‌వైజర్లుగా, కంట్రోలర్‌గా విధులు నిర్వర్తించే సీనియర్ ఉద్యోగులను దూర ప్రాంతాల్లో డ్యూటీ వేయడంతో సతమతం అయినట్లు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా ఒక డిపో నుంచి మరో డిపోకు కండక్టర్లను ఆమె బదిలీ చేశారని చెప్పుకుంటున్నారు. దీంతో మరో డిపోకు వెళ్లడం ఇష్టంలేని పలువురు ఇటు నిర్మల్ అటు మంచిర్యాలలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంలో ఆ నేతలు ఆర్‌ఎంతో మాట్లాడినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతోనే వారు ఆమె బదిలీ విషయంలో రాష్ట్రస్థాయిలో గట్టిగా ప్రయత్నాలు చేసి సక్సెస్ అయినట్లు తెలుస్తోంది.

ముగిసిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు


బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

తాంసి: భీంపూర్ మండలంలోని మార్కగూడ గ్రామంలో రాంజీగోండు యువజన సంఘం ఆధ్వర్యంలో మడావి రాజు స్మారకార్థం నిర్వహించిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలలో జిల్లాలోని పలు గ్రామాల జట్లతో పాటు మహారాష్ట్రకు చెందిన 120 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్రకు చెందిన సాలేగూడ, జవార్ల గ్రామాలకు చెందిన జట్లు తలపడ్డాయి. హోరాహరీగా సాగిన పోటీలో జవార్ల జట్టుపై సాలేగూడ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతి సాధించింది. గెలుపొందిన జట్టుకు యూత్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.21,000 (గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్) చేతుల మీదుగా, రెండో బహుమతి జవార్ల జట్టుకు రూ.15వేలు (గామపెద్ద త్రయంబక్), మూడో బహుమతి చింతగూడ జట్టుకు రూ.10వేలు (గ్రామస్తుడు రాంప్రభు), నాల్గో బహుమతి మార్కగూడ జట్టుకు రూ.7వేలు(మడాలి లింబాజీ భీంపూర్ సర్పంచ్) చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మడావి సునీత, యువజన సంఘం సభ్యులు నాగోరావు, వంశీ, సంతోష్, నాయకులు పాండ్‌రంగ్, పురుషోత్తం పాల్గొన్నారు.


జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాలు

సందడిగా ఖందేవ్ జాతర

- భక్తుల ప్రత్యేక పూజలు
- భారీగా తరలివస్తున్న ప్రజలు


జాతరలో ఏర్పాటు చేసిన రంగులరాట్నాలు

నార్నూర్: తొడసం వంశస్తుల ఆరాధ్య దైవం ఖందేవ్ జాతర ఘనంగా కొనసాగుతోంది. ఈ నెల 06న పుష్య పౌర్ణమి సందర్భంగా మహాపూజతో ప్రారంభమైన జాతర ఈ నెల 20 వరకు కొనసాగనుంది. మంగళవారం పాఠశాలలకు చివరి సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఖందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యువకులు కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. రంగులరాట్నాలు, చిన్న పిల్లల ఆట బొమ్మలు రావడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా జాతరలో ఉల్లాసంగా గడిపారు. గత వందేళ్లుగా జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన గిరిజనులు ఆడ పిల్లల పెళ్లికి సంబంధించిన సామగ్రిని జాతరలో కొనుగోలు చేస్తారు. బంధువులతో కలిసి వారి సంప్రదాయం ప్రకారం గాజులు చేతులకు వేసుకుని ప్రేమను చూపుతారు. జాతరకు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది.

‘రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం’

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్


బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న శంకర్

ఆదిలాబాద్: బ్యాంక్ అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం బాధిత రైతులతో కలిసి జిల్లా కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పలు బ్యాంక్ అధికారులు అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఖాతాల్లో వచ్చిన డబ్బులను క్రాప్ లోన్ పేరిట జమ చేసుకోవడం తగదన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే పంటలు సరిగ్గా పండక నష్టాల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో బ్యాంకర్లు మానవతాదృక్పతంతో వ్యవహరించాల్సింది పోయి బలవంతపు వసూళ్లకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయగా, ఆ డబ్బులను సైతం రైతులు తీసుకోకుండా ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు

- ఎంపీ సోయం బాపూరావు


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్: మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని టెలికాం అడ్వైజరీ కమిటీ చైర్మన్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన టెలికాం అడ్వైజరీ కమిటీ (టీఏసీ) మొదటి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నెట్‌వర్క్ లేని కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం సంబంధిత ప్రాంతాల్లో నెట్‌వర్క్ కల్పించేందుకు పార్లమెంట్‌లో బిల్లును సైతం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సొంత గ్రామమైన ఘనపూర్‌లో సైతం నెట్‌వర్క్ లేకపోవడం ఈ పరిస్థితికి నిదర్శనమని తెలిపారు. అటవీశాఖ సంబంధ అనుమతుల విషయంలో ఉన్న ఇబ్బందులను కేంద్ర అటవీ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో సైతం ఈ విషయాన్ని ప్రస్తావిస్తానన్నారు. ఉమ్మడి జిల్లాలోని 160 గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న టవర్ల విషయంలో జిల్లాల వారీగా సైతం త్వరలోనే సమీక్షిస్తానన్నారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ నెట్‌వర్క్ సేవలు అత్యవసరమయ్యాయని, ఈ నేపథ్యంలో మారుమూల ప్రాంతంలో ఉంటున్న గిరిజనుల అవస్థలను దూరం చేసేందుకు బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు సమష్టిగా కృషి చేయాలని, ఇందుకు పూర్తిగా సహకరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం టవర్ల ఏర్పాటుకు అనుమతించిందని, అటవీ ప్రాంతాల్లో స్థల సేకరణ విషయంలో ఇబ్బందులు వస్తున్నాయని పీజీఎం కేవీఎస్‌రావ్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, బీఎస్‌ఎన్‌ఎల్ ఏజీఎం దేవిదాస్, డీజీఎం జగ్గరాం, ఐఎఫ్‌ఏ విజయ్ కుమార్, జేటీవో రవీందర్, శ్రీధర్, సీతరాం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సెల్ఫీ విత్ రంగోళి


విజేతలను ప్రకటిస్తున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్: కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సెల్ఫీ విత్ రంగోళి పోటీలకు స్పందన లభించింది. బీజేపీ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన లక్కీ డ్రా పోటీల విజేతలను ఎంపీ సోయం బాపూరావు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అల్జాపూర్ శ్రీనివాస్, అసెంబ్లీ ప్రభారీ బద్దం లింగారెడ్డి, పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కంది శ్రీనివాస రెడ్డి, గడ్డం నందిరెడ్డి డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఎంపీ మాట్లాడుతూ సంక్రాంతి పండగ ప్రాశస్త్యాన్ని తెలిపే ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పోటీలో మొదటి బహుమతి 1 గ్రాము బంగారు నాణెం విజేతగా జైనథ్‌కు చెందిన గంగామణి, ఇరవై మంది వెండి నాణేల విజేతలు శ్రీజ, పూజ, లండే సంధ్య, శృతి , శ్రీజ, శరణ్య, సాయి సుధా, సోని, సౌజన్య, కీర్తి, వినూత్న, మైథిలి, శైలజ, హారిక, సోని, శ్రావ్య, సుజాత, స్వరూప, స్వరూప, స్ఫూర్తి ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గనగర్ శివారు ప్రాంతంలో అదే కాలనీకి చెందిన తుర్పటి ఎర్రన్న (60) ఉరేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఎర్రన్న గత కొన్ని నెలల నుంచి కీళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- రూ.5లక్షల ఆస్తినష్టం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్: ప్రమాదవశాత్తు ఇంటి కరెంట్ మీటర్‌లో నుంచి మంటలు వ్యాపించి మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన జలంపల్లి రామయ్య అనే రైతు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. రామయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రామయ్య, ఆయన భార్య లత ఇద్దరూ పొలం పనుల నిమిత్తం బయటకు వెళ్లగా వారి పిల్లలు సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లోని కరెంట్ మీటర్‌లో మంటలు చెలరేగడం అవి కాస్త పత్తిపై పడటంతో మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గమనించిన స్థానికులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కానరాలేదు. ఎస్టీపీపీ ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లోని కర్ర, విలువైన వస్తువులు, 50క్వింటాళ్ల పత్తి కలి పోయింది. రూ.5లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు రామయ్య వాపోయాడు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎస్సై రామకృష్ణ, సర్పంచ్ లింగారెడ్డి, ట్రాన్స్‌కో డిపార్టుమెంట్ సిబ్బంది పరిశీలించారు.

బైకును ఢీ కొట్టిన కారు

- ఒకరు దుర్మరణం


మల్లయ్య మృతదేహం పరిశీలిస్తున్న ఎస్సై

జన్నారం: అతివేగం, అజాగ్రత్త ఒకరి ప్రాణాన్ని బలికొంది. వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృత్యువాత పడ్డారు. ఎస్సై తానాజీ నాయక్ వివరాల ప్రకారం... మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అల్లం మల్లయ్య (56) సోమవారం సాయంత్రం 9గంటల ప్రాంతంలో మందపెల్లి గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందన్‌పల్లి నుంచి జన్నారం వైపు వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. మల్లయ్య తీవ్రంగా గాయపడగా కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. మల్లయ్యకు భార్య గంగవ్వ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జన్నారం డివిజన్‌లో పక్షుల కోలాహలం



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో పక్షులు కోలాహలం చేస్తున్నాయి. శీతాకాలం కావడంతో సుదూర ప్రాంతాల పక్షులు వలస వచ్చి ఇక్కడ వాటి సంతతిని పెంచుకుంటాయి. ఈ క్రమంలో జన్నారం అటవి డివిజన్‌లోని మైసమ్మ కుంట, బైసన్ కుంట ప్రాంతాలలో పక్షుల కోలాహలం కనిపించాయి. ఆసియా దేశాలకు సంబంధించిన ఆసియన్ ఓపెన్ బిల్ స్ట్రోక్, నార్తెన్ పింటెల్ పక్షులు ఆయా ప్రాంతాలలో కనిపించాయి.
–జన్నారం



